క్లుప్తంగా

కేంద్ర బడ్జెట్ ప్రతుల దహనం



హసన్‌పర్తి: ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రతులను సీపీఎం నాయకులు ఎర్రగట్టు జంక్షన్‌లో గురువారం దహనం చేశారు. సీపీఎం మండల కమిటీ సభ్యురాలు నాంపల్లి మౌనిక ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి పార్టీ మండల కార్యదర్శి గుమ్మడి రాములు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో కార్మికులు, రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. నాయకులు శంకర్, పుల్లా అశోక్, స్వామి కిషన్, రాములు, యాదమ్మ, రమేష్, రమ్య, శ్రీదేవి, భీమమ్మ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

హసన్‌పర్తి: ఎస్సీ వర్గీకరణను తెలంగాణ కేబినెట్ ఆమోదించడంపై కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఈమేరకు కాంగ్రెస్ ఎస్సీసెల్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు రామంచ దయాకర్, ఎస్సీసెల్ కార్యదర్శి అశోక్, 66వ డివిజన్ అధ్యక్షుడు కిరణ్, వీసం సురేందర్‌రెడ్డి, రవి, శ్రీనివాస్, రవి, కిశోర్, ప్రకాశ్ పాల్గొన్నారు.

సోలార్ రూఫ్ టాప్ బహూకరణ



హసన్‌పర్తి: నగరంలోని సాయి సేవా ట్రస్ట్‌కు 5 కేవీ సోలార్ రూఫ్ టాప్‌ను దాతలు బహూకరించారు. సుమారు రూ.2లక్షల విలువైన ఈ రూఫ్‌టాప్ అందజేసినవారిలో వెంకటరమణ (ఎస్ఈ, హనుమకొండ), జి.సాంబారెడ్డి(డీఈ, హనుమకొండ), ఎస్.సుబ్రమణేశ్వర రావు (ఏడీఈ, కాజీపేట), ఎన్. మల్లికార్జున్ (ఏడీఈ, హనుమకొండ), కె.రాజు (ఏడీఈ, నయీంనగర్) ఉన్నారు. వడ్డెపల్లి సబ్‌స్టేషన్ ఏఈ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

సరుకుల అందజేత

వరంగల్: అలియన్స్ క్లబ్ ఆఫ్ వరంగల్ అధ్యక్షుడు అలై దోమల నాగేందర్ ఆధ్వర్యంలో క్లబ్ లైఫ్ మెంబర్ అలై పొరండ్ల సతీష్ కుమార్ నగరంలోని స్వయంకృషి వృద్ధాశ్రమంలో గురువారం బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా అలై చిప్ప వెంకటేశ్వర్లు, నాయకులు మంత్రి లింగమూర్తి, గజ్జెల ఓంకార్‌లింగం శాస్త్రి, పెంట కుమార్, దస్తగిరి, క్లబ్ మెంబర్లు పాల్గొన్నారు.

గుంతల పూడ్చివేత



విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ మర్కాజీ హైస్కూల్ ఎదుట రోడ్డుపై ఏర్పడిన గుంతలను జాతీయ భద్రత మాసోత్సవాల్లో భాగంగా విద్యావికాస ప్రేరణ ఫౌండేషన్, రోటరీ క్లబ్, హనుమకొండ, ఏకశిల పార్కు వాకర్స్ అసోసియేషన్ సంయుక్తంగా రీసైక్లింగ్ మెటీరియల్‌తో గురువారం పూడ్చివేశారు. ఈ సందర్భంగా విద్యావికాస ప్రేరణ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పెండ్లి ఉపేందర్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రభుత్వ మర్కాజీ హైస్కూల్ హెచ్ఎం రామారావు, ఏకశిల వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పత్తిమల్ల ఎల్లగౌడ్, సైకిల్ వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు అనంత్, సోమయ్య, రమణారెడ్డి, రుద్రారపు జ్యోతి, మనోహర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



రాజు మృతదేహం

హసన్‌పర్తి: బైక్ అదుపు తప్పి.. డివైడర్‌కు ఢీకొట్టిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. వడ్డెపల్లి–ధర్మసాగర్ మార్గంలో నిరూప్‌నగర్ తండా వద్ద గురువారం రాత్రి జరిగిన ఈఘటనకు సంబంధించి కాకతీయ యూనివర్సిటీ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామానికి చెందిన మాచర్ల రాజు(35), నగరంలోని ఓ డయాగ్నస్టిక్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. గురువారం విధులు ముగించుకుని బైక్‌పై ముప్పారానికి బయల్దేరాడు. నిరూప్‌నగర్ తండా పెట్రోల్ పంప్ వద్ద బైక్ అదుపు తప్పి డివైడర్‌కు ఢీకొంది. ఈప్రమాదంలో రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరిచినట్లు పోలీసులు తెలిపారు.

కంపు.. కంపు!

- తెలంగాణ కాలనీలో ప్రజల అవస్థలు
- సరైన డ్రెయినేజీలు లేక ఇబ్బందులు
- ఖాళీ ప్రదేశాల్లో నిలుస్తున్న మురుగు
- పందులు, దోమల స్వైర విహారం

ఖిలా వరంగల్: పాలకుల అలసత్వం.. అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. వరంగల్–ఖమ్మం ప్రధాన రహదారికి సమీపాన 42వ డివిజన్ తెలంగాణ కాలనీలో మురుగునీరు పేరుకుపోవడంతో దుర్గంధం వెదజల్లడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. సుమారు 2వేల కుటుంబాలు నివాసముండే ఈ ప్రాంతాన్ని అధికారులు, పాలకులు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

కానరాని డ్రెయినేజీ వ్యవస్థ

కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ఖాళీ స్థలాల్లో మురుగునీరు నిలిచిఉంటుంది. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా.. తమ ప్రాంతం దుస్థితి మారడంలేదని ఇక్కడి ప్రజలు ఆవేదన చెందుతున్నారు. బావులు,బోర్ల తాగునీరు కలుషితమై ప్రజలు రోగాల బారిన పడాల్సి వస్తోంది. కాలనీలో ఎక్కడికక్కడ మురుగునీరు నిలిచి ఉండడంతో పందులు, దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



ఇళ్ల మధ్యలో నిలిచిన మురుగునీరు

కాలనీలో ఉండలేకపోతున్నాం..



ఖాళీ స్థలాలు మురికి కుంటలుగా మారి దుర్వాసన వస్తోంది. దోమలతో నరక యాతన అనుభవిస్తున్నాం. కాలనీ ఏర్పడి 20 ఏళ్లు అవుతున్నా డ్రెయినేజీలు లేవు. దీంతో రోగాల బారిన పడుతున్నాం. అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలి.

– జి.స్వరూప, స్థానికురాలు

డ్రెయినేజీలు నిర్మించాలి



కాలనీలో డ్రెయినేజీలను అభివృద్ధి చేయాలి. పై కాలనీలో నుంచి వచ్చే మురుగునీరు ఖాళీ స్థలాలు నిండి ఇళ్ల ముందర నిలిచి దుర్వాసన వస్తుంది. ఇంట్లోకి వెళ్లాలంటే మురుగు నీటిలోనుంచి వెళ్లాల్సిన పరిస్థితి. అధికారులు డ్రెయినేజీల నిర్మాణంపై దృష్టి సారించాలి.

– కొల్లూరు యోగానంద్, స్థానికుడు

మిర్చి రైతును దోచుకుంటున్న ఖరీదుదారులు

- తెలంగాణ రైతు సంఘం



ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి రైతులను ఖరీదుదారులు దోచుకుంటున్నారని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, ఈసెంపల్లి బాబులు ఆరోపించారు. గురువారం మార్కెట్ ముందు కొద్దిసేపు ధర్నా నిర్వహించారు. అనంతరం యార్డులోకి వచ్చి రైతులను ధరలపై అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మిర్చి సాగు చేస్తున్న రైతులకు ధర లేక భవిష్యత్తులో ధర పై ఆశ లేకపోవడంతో తక్కువ ధరకు అమ్ముకుని తీవ్రంగా నష్టపోతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం మిర్చి క్వింటాకు రూ.25 వేలు కనీస ధర నిర్ణయం చేసి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గత సంవత్సరం రూ.25 వేల ధర పలికిన ప్రస్తుతం రూ.10 నుంచి రూ.13 వేల తగ్గిపోయిందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పుచ్చకాయల కృష్ణారెడ్డి, చల్ల నర్సింహారెడ్డి, కొంగర నరసింహస్వామి, కడెం రమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి చుక్క ప్రశాంత్, రైతులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు రూ.5వేల కోట్లు కేటాయించాలి

- కొప్పు పద్మ



సదస్సులో మాట్లాడుతున్న పద్మ

నయీంనగర్: మత్స్యకారుల సంక్షేమానికి బడ్జెట్‌లో రూ.5 వేల కోట్లు కేటాయించి, ఖర్చు చేయాలని హైదరాబాద్ మత్స్యపారిశ్రామిక సహాయకసంఘం చైర్మన్ కొప్పు పద్మ డిమాండ్ చేశారు. హనుమకొండలోని ప్రెస్‌క్లబ్ గురువారం తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం (టీఎంకేఎంకేఎస్) ప్రధాన కార్యదర్శి గొడుగు వెంకట్ అధ్యక్షతన నిర్వహించిన హనుమకొండ జిల్లా సదస్సులో పద్మ మాట్లాడారు. వరంగల్ మహానగరంలో చేపలు అమ్ముకునే చోటనే శాశ్వత రిటైల్ చేపల మార్కెట్లను నిర్మించాలన్నారు. ప్రతి మత్స్య సొసైటీకి రూ.10 లక్షల ఉచిత రుణాలు, వరంగల్‌లో 10ఎకరాల స్థలంలో రూ.50 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన చేపల ఎక్స్‌పోర్ట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. మహిళా సొసైటీకి చేపల వంటకాలు, పచ్చళ్లపై శిక్షణ ఇచ్చి, నగరంలోని ప్రధాన జంక్షన్లలో ఫిష్ స్టాల్స్ ఏర్పాటుచేసి మహిళా సొసైటీలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గంగపుత్ర హౌసింగ్ సొసైటీ చైర్మన్ జోలి రాజలింగం మాట్లాడుతూ.. జలవనరులను కబ్జాలు, కాలుష్యం నుంచి కాపాడి మత్స్య వృత్తిని కాపాడాలని పిలుపునిచ్చారు. గొడుగు వెంకట్, నిమ్మల రాజేందర్, దుర్గయ్య, రవి, పవన్, రాధిక, సరోజన, మమత, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

- నార్కొటిక్ ఏసీపీ సైదులు



మాట్లాడుతున్న నార్కొటిక్ ఏసీపీ సైదులు

కాజీపేట: మత్తుపదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని జిల్లా నార్కొటిక్ విభాగం ఏసీపీ సైదులు అన్నారు. కాజీపేట మండలం సోమిడి శివారులోని తాళ్లపద్మావతి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం సాయంత్రం జాగృతి పోలీస్ కళాబృందం సభ్యులు గుట్కా, గంజాయి, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. షార్టు ఫిలిం ద్వారా అవగాహన కల్పించారు. కళాశాల పరిసర ప్రాంతాల్లో మత్తు పదార్థాల క్రమ విక్రయాలు జరుగుతున్నట్లుగా అనుమానం ఉంటే వెంటనే 87125, 84473, 100 సైబర్ నేరాలకు 1930 నంబర్‌లకు డయల్ చేయాలని మడికొండ సీఐ కిషన్ కోరారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు తాళ్ల వంశీ, చైతన్య, నార్కొటిక్ సీఐ రవీందర్, ఎస్సైలు రాజ్‌కుమార్, నాగమణి, విలియం తదితరులు పాల్గొన్నారు.

కోటను సందర్శించిన శ్రీలంక పర్యాటకులు



పర్యాటకులకు కాకతీయుల నిర్మాణశైలిని వివరిస్తున్న సూర్యకిరణ్

ఖిలావరంగల్ : చారిత్రక ప్రసిద్ధిచెందిన ఖిలా వరంగల్ కోటను శ్రీలంక పర్యాటకులు సందర్శించారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఈ టూరిజంలో భాగంగా గురువారం మధ్యకోటలోని శిల్పా కళా సంపదను తిలకించారు, అనంతరం ఖుష్ మహల్, ఏకశిలగుట్ట , శృంగారపు బావి వీక్షించారు. ఆ తర్వాత టీజీటీడీఎస్ వారి ఆధ్వరంలో నిర్వహించిన సౌండ్ అండ్ లైటింగ్ షోను తిలకించారు. కాకతీయుల చరిత్రను టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ సూర్యకిరణ్ వివరించారు.

పీహెచ్‌డీ ఉంటేనే ప్రిన్సిపాల్‌గా నియమించాలి



వినతిపత్రం అందజేస్తున్న సంఘం బాధ్యులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని వర్సిటీ అనుబంధ కళాశాలల్లో డిగ్రీ అండ్ పీజీ కళాశాలల్లో పీహెచ్‌డీ కలిగినవారినే ప్రిన్సిపాల్‌గా నియమించాలని గురువారం కాకతీయ యూనివర్సిటీ డాక్టరేట్స్ అసోసియేషన్ (కుడా) ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.రామచంద్రానికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో కుడా అధ్యక్షుడు డాక్టర్ తీగల ప్రేమ్‌సుందర్, కన్వీనర్ డాక్టర్ సూత్రపు అనిల్, బాధ్యులు డాక్టర్ మద్దిరాల మోహన్‌రెడ్డి, డాక్టర్ బోడ వీరన్న, డాక్టర్ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

వరంగల్: 14వ డివిజన్ ఎస్సార్‌నగర్‌లో బొందిలి కులానికి చెందిన కోతులవాళ్లు 25ఏళ్ల నుంచి ఉంటున్నందున వారికి పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని స్థానిక నాయకులు కొత్తకొండ రాజు, ఇంతియాజ్, అంబాల సత్యం, పసలాది మల్లయ్య, కేతిరి రాజశేఖర్, మాచర్ల స్టాలిన్, దామెర కృష్ణలు డిమాండ్ చేశారు. కొంతమంది భూకబ్జాదారులు రియల్ ఎస్టేట్ బ్రోకర్లు వారు నివసించే గుడిసెలపై కన్నేసి విలువైన భూములు ఆక్రమించుకునేందుకు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఫేక్ డాక్యుమెంట్లు తీసుకు రాగా.. తహసీల్దార్ సర్వే చేయించి ప్రభుత్వభూమి అని బోర్డు పెట్టించారని తెలిపారు. ఈస్థలంలో కోతులు పట్టే వారికి కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో రాహేలా, సమ్మక్క, రాయపోషాలు, హైమావతి, సరోజన, దాసు పాల్గొన్నారు.

వేలం వాయిదా

మడికొండ: మహా శివరాత్రి ఉత్సవాల నేపథ్యంలో మెట్టురామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం వేలం పాటలను నిర్వహించగా కేవలం వాహన పార్కింగ్, చెరుకు బండి నిర్వహణకు మాత్రమే టెండర్లు అయినట్లు కార్యనిర్వహణాధికారి కే.శేషుభారతి తెలిపారు. వాహన పార్కింగ్‌కు రూ.26,000, కాగా చెరుకు బండి నిర్వహణకు రూ.12,000 వచ్చినట్లు తెలిపారు. మిగతా వాటికి తిరిగి టెండర్లను నిర్వహించనున్నట్లు తెలిపారు. లడ్డు పులిహోర, కొబ్బరికాయలు, కొబ్బరి చిప్పల పోగు, అభిషేక పంచామృతాలను అమ్ముకునేందుకు తిరిగి వేలం నిర్వహించేందుకు ప్రకటనలో తెలియజేస్తామని ఈఓ తెలిపారు.

కేయూలో తెగిపడిన 11కేవీ విద్యుత్ తీగ

- తప్పిన పెనుప్రమాదం



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి 11 కేవీ విద్యుత్ తీగలు క్యాంపస్‌లో నుంచి చెట్లమధ్యనుంచి రుద్రమాంబ ఫిల్టర్ బెడ్ వరకు ఉన్నాయి. ఇందులో ఒక తీగ గురువారం క్యాంపస్‌లోని పరీక్షల విభాగం పబ్లికేషన్ సెల్ సమీపంలో తెగి పడింది. ఆ సమయంలో అప్రాంతంలో ఎవరూ లేకపోవటంతో పెను ప్రమాదం తప్పినట్లైంది. కేయూ అభివృద్ధి అధికారి ప్రొఫెసర్ వాసుదేవరెడ్డి, బిల్డింగ్ డివిజన్ సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎన్పీడీసీఎల్ సిబ్బంది చేరుకొని విద్యుత్‌తీగ పునరుద్ధరణ పనులు చేపడుతున్నారు. రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం, ప్రొఫెసర్ వాసుదేవరెడ్డి, తోట రాజయ్య పరిశీలించారు.

‘ఎమ్మెల్సీ మల్లన్నను బర్తరఫ్ చేయాలి’



సమావేశంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

నయీంనగర్: రెడ్డి కులంపై అనుచిత వ్యాఖ్యలు చేసి రెడ్డి కులస్తుల మనోభావాలను దెబ్బతీసిన ఎమ్మెల్సీ చింతపండు నవీన్‌కుమార్ (తీన్మార్ మల్లన్న)ను కాంగ్రెస్ పార్టీ బర్తరఫ్ చేయాలని తెలంగాణ రాష్ట్ర రెడ్డి సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు అర్జులు కిషన్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు గ్రామాల్లో కులాల వారీగా ఘర్షణలకు దారితీసే విధంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. మల్లన్న కాంగ్రెస్ పార్టీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని, పీసీసీ అధ్యక్షుడికి విజ్ఞప్తి చేశారు. మల్లన్నను బర్తరఫ్ చేయాలని గవర్నర్‌కు వినతి పత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో కృష్ణారెడ్డి, కట్టా రఘుపాల్ రెడ్డి, రావుల నర్సింహారెడ్డి, చాడ వెంకటేశ్వర్ రెడ్డి, నల్ల రాజిరెడ్డి, జైహింద్ రెడ్డి, వీసం సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏఓల పోస్టులు పెంచాలి



వినతి పత్రం అందజేస్తున్న సెకెండ్ ఏఎన్ఎంలు

దేశాయిపేట: వైద్యశాఖలో ఏఓల పోస్టులు పెంచడంతోపాటు పరీక్షకు అర్హతలేని వారికి రూ.10 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్‌తోపాటు, 100శాతం గ్రాస్ సాలరీలను ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం డీఎంహెచ్ఓ సూపరింటెండెంట్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. సెకండ్ ఏఎన్ఎంలతో రెండు దశాబ్దాలుగా పని చేయించుకున్న ప్రభుత్వాలు రిటైర్మెంట్ సమయంలో వట్టి చేతులతో ఇంటికి పంపించడం ఏమాత్రం సమంజసం కాదని అన్నారు. గత ప్రభుత్వ కాలంలో రెండో ఏఎన్ఎంలు తమను రెగ్యులర్ చేయాలని పోరాటం చేశారని, అది సాధ్యం కాదని అప్పటి ప్రభుత్వం తేల్చి చెప్పిన కారణంగా కనీసం గ్రాస్‌సాలరీ ఇవ్వాలని లేకుంటే ఈనెల 17నుంచి నిరవధిక సమ్మెను చేపడతామని ఏఐటీయూసీ వరంగల్ జిల్లా సెకండ్ ఏఎన్ఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రజిత తెలిపారు. కార్యక్రమంలో టి.ప్రసన్న, సుజాత, సుధ, కవిత, సునీత, దేవయాని, అనిత తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు హెల్త్ ఇన్సూరెన్స్ చేస్తాం

- టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు లెనిన్



సమావేశంలో మాట్లాడుతున్న లెనిన్

వరంగల్: జర్నలిస్టులందరికీ హెల్త్ ఇన్సూరెన్స్ చేయనున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీఆర్ లెనిన్ అన్నారు. వరంగల్‌లోని వరంగల్ తూర్పు జర్నలిస్టు పరపతి సంఘం భవనంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు కోరుకొప్పుల నరేందర్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు ఎం.నవనీత్‌గౌడ్ అధ్యక్షతన గురువారం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న లెనిన్ మాట్లాడుతూ రాష్ట్రంలో డెస్క్ జర్నలిస్టులను గుర్తించి అల్లం నారాయణ అక్రిడిటేషన్లు ఇప్పిస్తే.. ప్రస్తుత ప్రభుత్వం కోత పెట్టేందుకు సిద్ధమైందన్నారు. అలా చేస్తే పోరాటాలకు సిద్ధమని తెలిపారు. . ప్రెస్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు తుమ్మ శ్రీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పెరుమాడ్ల వెంకటేశ్వర్లుతోపాటు మరికొందరిపై పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన పిటిషన్‌ను ప్రెస్‌క్లబ్ కమిటీ వెనక్కి తీసుకుని, వారి సభ్యత్వాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేసారు. యూనియన్ సభ్యత్వం తీసుకున్న ప్రతి సభ్యుడికి హెల్త్ ఇన్సూరెన్స్ చేసి అండగా ఉంటామన్నారు. గుర్తింపు ఉన్న సంస్థల్లో పనిచేసే వారికే యూనియన్ సభ్యత్వాలు ఇవ్వాలని చెప్పారు. తూర్పు నియోజకవర్గంలో ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం తీర్మానాలను అమోదించారు. సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వాంకె శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ సంఘం కమిటీ ఎన్నిక



నూతన కార్యవర్గ బాధ్యులు

హన్మకొండ చౌరస్తా: శ్రీవిఘ్నేశ్వర తెలంగాణ నాయీబ్రాహ్మణ సేవా సంఘం నయీంనగర్ శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక గురువారం హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లో నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా గజవెల్లి యాదగిరి, అధ్యక్షుడిగా యాదగిరి గురుమూర్తి, ఉపాధ్యక్షుడిగా మురహరి తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా శ్రీరాముల రాజు, సహాయ కార్యదర్శిగా నడిగోటి ప్రభాకర్, కోశాధికారిగా చెన్న రవీందర్, ప్రచార కార్యదర్శులుగా పుట్టపాక రాజేందర్, కొత్తపల్లి సునీల్, గౌరవ సలహాదారుడిగా శ్రీరాముల వీరస్వామి, కార్యవర్గ సభ్యులుగా గజవెల్లి ఉపేందర్, రాచకొండ శ్రీనివాస్, ఉద్దెమారి గణపతి, ఎనగందుల నూతన్, నడిగోటి శ్రీకాంత్, జంపాల ప్రవీణ్, ఉద్దెమారి శంకర్, తంగెళ్లి ప్రవీణ్ ఎన్నికైనట్లు గురుమూర్తి వెల్లడించారు.

బ్లాక్‌స్థాయి స్పోర్ట్స్ మీట్

హసన్‌పర్తి: నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో రెండురోజుల పాటు (ఈనెల 8,10) తేదీల్లో బ్లాక్ స్థాయి స్పోర్ట్స్ మీట్ నిర్వహించనున్నట్లు నెహ్రూ యువజన కేంద్రం అధికారి అన్వేష్ తెలిపారు. 18 ఏళ్ల నుంచి 29 ఏళ్ల వయసు కలిగిన వారు అర్హులన్నారు. మండల వ్యాప్తంగా ఆసక్తిల గల యువతీ, యువకులు శుక్రవారం(ఈనెల7న) తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 99639 45620 ఫోన్ నంబర్ ద్వారా సంప్రదించాలని సూచించారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

ఖిలా వరంగల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో పేదలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిన నేపథ్యంలో గురువారం వర ంగల్ 35వ డివిజన్ పుప్పాల గుట్టలోని గాంధీ విగ్రహం వద్ద ప్రధాని మోదీ చిత్రపటానికి బీజేపీ శ్రేణులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా బీజేపీ శివనగర్ అధ్యక్షుడు ఎండీ రఫీ మాట్లాడారు. కార్యక్రమంలో కనుకుంట్ల రంజిత్, శ్యామ్, అడెపు వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

దేశ ఆర్థికాభివృద్ధిలో సీఏలు కీలకం

వరంగల్: దేశ ఆర్థిక అభివృద్ధిలో చార్టెడ్ అకౌంటెంట్ల పాత్ర ఎంతో కీలకమని ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ)అధ్యక్షుడు సీఏ రజత్‌కుమార్ అన్నారు. హైదరాబాద్‌లోని జీఎంసీ బాలయోగి ఆడిటోరియంలో గురువారం జరిగిన ఐసీఏఐ స్నాతకోత్సవంలో వరంగల్‌కు చెందిన సీఏ గంగిశెట్టి పౌలోమీ సీఏ పట్టా అందుకున్నారు.

బ్రహ్మోత్సవాలు పూర్తి

వరంగల్: వరంగల్ బట్టలబజారులోని శ్రీబాలా వేంకటేశ్వరస్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలను ఆరురోజులపాటు నిర్వహించినట్లు ఆలయ ఈఓ రత్నాకరరెడ్డి, చైర్మన్ పరాశరం శ్రీనివాసాచార్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఉదయం మహా పూర్ణాహుతి, చక్ర స్నానం, తీర్థ, అన్న ప్రసాద వితరణ, సాయంత్రం శ్రీపుష్ప యాగం, ద్వాదశ ఆరాధన, ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు పూర్తయినట్లు తెలిపారు. దాతలకు ధన్యవాదాలు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

క్యాలెండర్ ఆవిష్కరణ



కాజీపేట అర్బన్: నిట్ వరంగల్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను యూనియన్ గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం, యూనియన్ అధ్యక్షుడు కరుణాకర్, ప్రధాన కార్యదర్శి మల్లేశం, కార్యదర్శి ప్రమోద్, ఉపాధ్యక్షుడు కార్తీక్, లాలు, శారద, మురళి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

కాజీపేట అర్బన్: మాజీ మంత్రి, ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌ను గురువారం మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ హైదరాబాద్‌లోని తన నివాసంలో పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన పద్మారావును పరామర్శించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

శుభాకాంక్షలు



మడికొండ: భారతీయ జనతా పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డికి పార్టీ నాయకులు గురువారం శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మధు, బిరపాక వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

పథకాల పేరుతో ప్రభుత్వం మోసం



వరంగల్: రాష్ట్రంలోని కాంగ్రెస్ నేతృత్వంలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సంక్షేమ పథకాల పేరుతో పేదలను మోసం చేస్తూ.. ప్రాణాలు తీస్తున్నదని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. లబ్ధిదారుల జాబితాలో తన పేరు లేదని ఆత్మహత్యకు పాల్పడిన ములుగు జిల్లా బుట్టాయిగూడెంకు చెందిన కుమ్మరి నాగయ్య (నాగేశ్వర్ రావు) మృతదేహాన్ని గురువారం సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రభుత్వం అర్హులైన ప్రతీ ఒక్కరికీ పథకాలు వర్తింపజేయాలని పేర్కొన్నారు.

విద్యార్థులకు అండగా ఏఐఎస్ఎఫ్



డైరీని ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌రావు

ఖిలా వరంగల్ : దేశ వ్యాప్తంగా విద్యార్థుల సమస్యలపై అనేక పోరాటాలు చేసి, వారికి అండగా నిలిచిన సంఘం ఏఐఎస్ఎఫ్ ఒక్కటేనని ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు అన్నారు. ఈమేరకు గురువారం వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో జిల్లా అధ్యక్షుడు ల్యాదల్ల శరత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన 2025 ఏఐఎస్ఎఫ్ డైరీని ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రతినిధులు శివ, రమేశ్, కుమార్, శరత్ పాల్గొన్నారు.